క్లుప్తంగా

నేడు స్పీకర్ పర్యటన

ధారూరు: శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ శుక్రవారం ధారూరు మండలంలో పర్యటించనున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కేరెళ్లి గ్రామంలో లయన్స్‌క్లబ్ నిర్మించిన మరుగుదొడ్లు, అల్లిపూర్‌లో రోడ్డు పనులకు శంకుస్థాపన, ధారూరు రైతు వేదికలో షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ నేడు

కుల్కచర్ల: మండల కేంద్రం రైతు వేదికలో 140మంది లబ్ధిదారులకు శుక్రవారం కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేయనున్నామని తహసీల్దార్ మురళీధర్ తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి రానున్నారని పేర్కొన్నారు. లబ్ధిదారులు, అధికార సిబ్బంది సకాలంలో హాజరుకావాలని కోరారు.

పీహెచ్‌సీ చైర్మన్‌కు సన్మానం



గురునాథ్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

కొడంగల్ రూరల్: పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే ఆర్.గురునాథ్ రెడ్డిని గురువారం హైదరాబాద్‌లోని కార్పొరేషన్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ నాయకులు ఘనంగా సన్మానించారు. ఇందులో పీఏసీఎస్ చైర్మన్ కటుకం శివకుమార్ గుప్తా, పర్సాపూర్ మాజీ సర్పంచ్ సయ్యద్ అంజద్, చిన్ననందిగామ వినోద్‌కుమార్, సాయిలు, లక్ష్మీపల్లి చిన్న పకీరప్ప తదితరులు ఉన్నారు. మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ డైరెక్టర్‌కు..



రాజును సన్మానిస్తున్న నాయకులు

యాలాల: తాండూరు ఏఎంసీ డైరెక్టర్ రాజును గురువారం కోఆప్షన్ సభ్యుల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు అక్బర్‌బాబా, హాజీపూర్ మాజీ సర్పంచ్ ఒంగోనిబాయి శ్రీనివాస్, మాజీ డైరెక్టర్ పేర్కంపల్లి వెంకట్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాజు భవిష్యత్తులో రాజకీయంగా మరింత ఎత్తుకు ఎదగాలని ఆకాంక్షించారు.

చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న తహసీల్దార్ దానయ్య

దుద్యాల్: పెండింగ్‌లో ఉన్న 24 కల్యాణలక్ష్మి, 4 షాదీ ముబారక్ చెక్కులను తహసిల్ కార్యాలయంలో గురువారం తహసీల్దార్ దానయ్య లబ్ధిదారులకు అందజేశారు. ఇందులో ఆర్‌ఐ రవీందర్, మాజీ సర్పంచ్ ఖాజ, కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకటయ్య తదితరులు ఉన్నారు.

విద్యార్థుల అభ్యున్నతికి కృషి

కుల్కచర్ల: ప్రభుత్వ పాఠశాల మౌలిక సదుపాయాలు, విద్యార్థులకు బ్యాగులు, షూస్ పంపిణీ చేయడం అభినందించదగిన విషయమని ప్రధానోపాధ్యాయుడు వెంకటయ్య అన్నారు. గురువారం మండల పరిధి తిర్మలాపూర్ గ్రామం ప్రాథమిక పాఠశాలలో అంకిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాగులు, షూస్ తదితర సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్.. విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తున్న ఫౌండేషన్ సభ్యులను అభినందించారు. సర్కారు బడుల్లో విద్యనభ్యసించే పేద విద్యార్థులకు అండగా ఉండటం చాలా గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ మండల కార్యదర్శి రవికుమార్, నాయకులు ఉమాశంకర్, మల్లేశ్, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉమ్రా వెళ్తున్న యువకుడికి సన్మానం



కబీర్‌ను సన్మానిస్తున్న ఎంఐఎం శ్రేణులు

కొడంగల్ రూరల్: పట్టణానికి చెందిన పండ్ల వ్యాపారి మహ్మద్ అబ్దుల్ కబీర్ ఉమ్రా వెళ్తున్న సందర్భంగా గురువారం ఎంఐఎం పార్టీ కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్‌బీ.గుల్షన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఇందులో ఎండీ.సర్తజ్ హుస్సేన్, షేక్ రోమన్, సయ్యద్ ముస్తాఫ, ఎండీ.ముర్తుజా హుస్సేన్, ఎండీ.అజర్, ఎండీ.షన్వాజ్ హుస్సేన్, సయ్యద్ అర్షద్ అలీ ఖాద్రి తదితరులు పాల్గొన్నారు.

పాపం మూగజీవాలు

వరుస ప్రమాదాలతో మృత్యువాత
- నెల రోజుల్లో మూడు ఘటనలు
- అవగాహన లేక, పరిహారం అందక నష్టపోతున్న యజమానులు



పలుగురాళ్ల తండాలో మృతి చెందిన ఎద్దు(ఫైల్)

దుద్యాల్: ప్రకృతి విపత్తులు, మానవ తప్పిదాలకు మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. ఈదురు గాలులతో కూడిన వర్షాల సమయంలో పిడుగులు నిప్పులు కురిపించడం, విద్యుత్ తీగలు తెగిపడటం వ్యవసాయ బావులు, అటవీ ప్రాంతాల్లో తరచూ జరుగుతుంటుంది. ఈ ఘటనల్లో పశుసంపదతో పాటు మనుషుల ప్రాణాలు గాలిలో కలిసి పోతున్నాయి. కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్ల కారణంగా విద్యుదాఘాతంతో అనేక పశువులు చనిపోతున్నాయి.

రెండు నెలల్లో..

విద్యుదాఘాతంతో దుద్యాల మండలం పోలేపల్లి తండాకు చెందిన రాథోడ్ చందు నాయక్‌కు చెందిన పాడిపశువు చనిపోయింది. దాని విలువ సుమారు రూ.70వేలు ఉంటుంది. పల్లెగడ్డకు చెందిన ముకుంద రెడ్డికి చెందిన ఎద్దు కరెంట్ షాక్‌తో మరణించింది. దాని విలువ రూ.60వేలు ఉంటుంది. కొడంగల్ మండలం పలుగురాళ్లతండాకు చెందిన మునేగారి సాయిలుకు చెందిన ఎద్దు బుధవారం విద్యుదాఘాతానికి బలైంది. దాని విలువ రూ.50వేల వరకు ఉంటుందని బాధితుడు తెలిపాడు.

మనుషులకు ప్రమాదం జరిగితే..

విద్యుత్ ప్రమాదం వలన మనుషులు మరణించినా, అంగవైకల్యం కలిగినా ప్రమాద విషయాన్ని వెంటనే విద్యుత్‌శాఖ అధికారులకు తెలపాలి. వైద్యం, ఇతరత్రా ఖర్చుల వివరాలకు సంబంధించిన ధ్రువపత్రాలు దరఖాస్తుకు జతపరిచి ఆ శాఖ ఏఈకి అందజేయాలి. పరిశీలిన అనంతరం పరిహారం మంజూరు చేస్తారు. చనిపోయినట్లతే శాశ్వత పరిష్కారం కింద పరిహారం అందుతుంది.

మూగజీవాలకు..

పశువులు విద్యుదాఘాతంతో చనిపోతే ముందుగా సంబంధిత శాఖ అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శికి సమాచారం ఇవ్వాలి. పశువైద్యాధికారి నుంచి దాని ఖరీదు తెలిపే పత్రం, మృతి చెందినట్లు ధ్రువీకరణ పత్రం తీసుకోవాలి. పరిశీలన అనంతరం పరిహారం పశువు యజమానికి అందుతుంది.

ఇలా చేస్తే పరిహారం

విద్యుత్ ప్రమాదం జరిగిన వెంటనే పరిహారం కొరకు పోలీసులకు ఫిర్యాదు చేయాలి. కేసు నమోదు అయిన తర్వాత పశు వైద్యులు, వైద్యుల సహాయంతో పంచనామా చేయించాలి. పరిహారం పొందేందుకు కేసుకు సంబంధించిన పత్రాలతో విద్యుత్‌శాఖ సహాయక ఇంజినీర్‌కు దరఖాస్తు చేసుకోవాలి. మరణ ధ్రువపత్రం, ఎఫ్ఐఆర్, పంచనామా నివేదిక, ఆధార్ కార్డు, బ్యాంకు పుస్తకం తదితర కాపీలను జతపరిచి విద్యుత్ ఏఈకి అందజేయాలి. ఏఈ నుంచి పత్రాలు ఏడీఈకి చేరతాయి. అనంతరం ఉన్నత అధికారుల పరిశీలనకు వెళ్తాయి. ఆ తర్వాత నష్ట పరిహారం బాధితుల బ్యాంకు ఖాతాలో జమ అవుతుంది.

స్థాయిని బట్టి పరిహారం



విద్యుత్ ప్రమాద స్థాయిని బట్టి పరిహారం ఉంటుంది. నిబంధనల ప్రకారం అన్ని ధ్రువీకరణ పత్రాలు ఉండాలి. మూగ జీవాల విషయంలో పశు వైద్యాధికారి ఇచ్చే ధ్రువీకరణ పత్రాలు పరిగణనలోకి తీసుకుంటాం. ప్రమాదాల బారిన పడిన వెంటనే అధికారులకు తెలపాలి. గ్రామాల్లో విద్యుత్ సిబ్బందితో ప్రజలకు అవగాహన కల్పించేందుకు కృషి చేస్తాం.

– సురేశ్ కుమార్, విద్యుత్ ఏఈ, దుద్యాల్ మండలం

నిర్ధారణ అయితేనే..



మూగ జీవాలు విద్యుత్ ప్రమాదానికి గురైతే.. వెంటనే పశువైద్యులకు సమాచారం ఇవ్వాలి. అనంతరం కళేబరానికి నిజ నిర్ధారణ పరీక్షలు చేస్తాము. కరెంట్ షాక్‌తోనా, మరేదైనా కారణం ఉందా అని పరిశీలిస్తాం. అనంతరం మరణ ధ్రువపత్రం, పరీక్షకు సంబంధించిన ప్రతాలు పశువు యజమానికి అందజేస్తాము.

– రియాజ్ హమీద్, పశు సంవర్ధక అధికారి, కొడంగల్

రోడ్లకు మరమ్మతులు చేపట్టండి



దోమ: గుంతలను పూడ్చివేస్తున్న యువకులు

దోమ: గ్రామీణ ప్రాంత రోడ్లు అధ్వానంగా ఉన్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోవటం లేదని బాధిత గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. మండల పరిధి బొంపల్లి ప్రధాన రోడ్డులో గతంలో మిషన్ భగీరథ పైపులైను కొరకు గుంతలు తీసి పైప్‌లైన్ తీశారు. మట్టితో పూడ్చారు. కానీ ఇటీవల కురిసిన వర్షాలకు మట్టిపోయి భారీ గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. కొత్తవారు ప్రమాదాల బారిన పడుతున్నారు. విషయం తెలిసినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపించారు. గోతులను పరిశీలించిన స్థానిక యువకులు సొంత డబ్బులు వెచ్చించి గురువారం గోతులను పూడ్చివేయించారు. దీంతో గ్రామస్తులు, వాహనదారులు యువకులను అభినందించారు. ఇందులో అప్పగాళ్ల రమేశ్, కుర్వ రమేశ్, ముద్దం శ్రీనివాస్, లోకేశ్ యాదవ్, బాలు, మంత్రి నవీన్ ఉన్నారు.

ప్యాచ్‌వర్క్ అయినా..

బంట్వారం: బంట్వారం, కోట్‌పల్లి మండలాల్లో పంచాయతీ రాజ్ ఆర్‌అండ్‌బీ రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని, వీటికి మరమ్మతులు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. వానాకాలం కావడంతో రోడ్లపై గుంతలు ఏర్పడి తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తక్షణమే ప్యాచ్‌వర్క్ అయినా చేపట్టలే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

దాడులకు పాల్పడితే సహించేది లేదు



విధులను బహిష్కరించిన న్యాయవాదులు

పరిగి: న్యాయవాదులపై దాడులకు పాల్పడితే సహించేది లేదని పరిగి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ హెచ్చరించారు. సిద్దిపేట కోర్టుకు చెందిన న్యాయవాది రవికుమార్‌పై పోలీసులు చేయిచేసుకోవడంపై గురువారం పరిగిలో న్యాయవాదులు విధులను బహిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సిద్దిపేట కోర్టు న్యాయవాది సిద్దిపేట పీఎస్‌లో షూరిటీలు పార్సిస్ చేయబోతే క్రమంలో.. ఏఎస్ఐ న్యాయవాదిని 5గంటల పాటు కూర్చోబెట్టుకోవడమే కాకుండా చేయిచేసుకోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. చేయిచేసుకున్న ఏఎస్ఐపై పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి భక్తకుమార్, న్యాయవాదులు పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మాణానికి వినతి

కొడంగల్ రూరల్: మండల పరిధి బోయపల్లితండా వీధుల్లో మురుగుకాల్వలు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు భీమ్యానాయక్ కోరారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని కడా కార్యాలయంలో ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఇందులో ఎస్టీసెల్ మండల అధ్యక్షుడు తార్యానాయక్, సామ్యానాయక్‌లు ఉన్నారు.

వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేయండి



కలెక్టరేట్ వద్ద విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా ప్రతినిధులు

అనంతగిరి: జిల్లా స్థాయిలో వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేయాలని తెలంగాణ విశ్రాంత ఉద్యోగుల సంఘం వికారాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహ్మారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. పీఆర్‌సీ 2023ను అమలు చేయాలని, నాలుగు డీఆర్ బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. ఈహెచ్ఎస్ వైద్య చికిత్సలకు నగదు రహిత వైద్యం అందించాలని, ఈ కుబెర్‌లో ఉన్న పెండింగ్ బిల్లులను వెంటనే ఇవ్వాలన్నారు. కమ్యూటేషన్ చెల్లించే కిస్తులు 15 సంవత్సరాల నుంచి 12 సంవత్సరాలకు కుదించడంతో పాటు మెడికల్ అలవెన్స్ రూ.600 నుంచి రూ.4వేలకు పెంచాలని కోరారు. జిల్లా కేంద్రంలో విశ్రాంత ఉద్యోగులకు భవన వసతి కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు బందెప్పగౌడ్, సతీష్‌చంద్ర, చిన్నారెడ్డి, రాధాకృష్ణ, వెంకట్‌రెడ్డి, శివలింగం, అంబదాసు, మొగులయ్య, సత్యనారాయణరెడ్డి, బుచ్చయ్య, వెంకట్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

మంచి చెడులపై అవగాహన తప్పనిసరి



విద్యార్థులకు బహుమతి ప్రదానం చేస్తున్న ఉపాధ్యాయులు

కుల్కచర్ల: సమాజంలో జరుగుతున్న మంచి చెడులపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని ప్రధానోపాధ్యాయుడు పాండురంగయ్య అన్నారు. గురువారం మండల పరిధి ఇప్పాయిపల్లి జడ్పీ పాఠశాలలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు 'అధిక జనాభా వలన కలిగే నష్టాలు', 'ప్రస్తుత జనభా నుంచి మనం ఎదుర్కొంటున్న సమస్యలు' అనే అంశంపై వ్యాసరచన, ఉపన్యాసం, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. వాటిల్లో ప్రతిభచూపిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, పాల్గొన్న వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ప్రత్యేక రోజుల ప్రాముఖ్యతని వివరిస్తూ ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కిరణ్ కుమార్, సరిత, రుక్మిణి, శివశంకర్, శ్యాంసుందర్, యాదయ్య, మహమూద్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

కాలం చెల్లిన 'బండ'లతో జాగ్రత్త

దోమ: 'గ్యాస్ వినియోగదారులు సిలిండర్లను ఎప్పటికప్పుడు పరిశీలించాలి. గడువు ముగిసినట్లయితే ఏజెన్సీకి చెప్పి మార్చుకోవాలి' అని దత్తసాయి హిందుస్థాన్ ఏజెన్సీ ప్రతినిధి విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. గురువారం మండల పరిధి బ్రాహ్మణపల్లి గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ వినియోగదారులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి లబ్ధిదారుడు గ్యాస్ వినియోగం పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాలం చెల్లిన సిలిండర్లను వాడకూడదని, బండకు ఉండే రబ్బరు ట్యూబ్‌లను పరిశీలించి మార్చుకోవాలని స్పష్టంచేశారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని వెల్లడించారు.

ఆరోగ్యమే ముఖ్యం

దుద్యాల్: విద్యార్థుల ఆరోగ్యమే ప్రధానమని మండల వైద్య అధికారి డాక్టర్ హేమంత్ కుమార్ అన్నారు. గురువారం మండల పరిధి చెట్టుపల్లి తండాలో కేజీబీవీ, చిలుముల మైలారంలో కొడంగల్ మైనార్టీ గురుకుల పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నాన్-టీచింగ్ సిబ్బంది రక్త నమూనాలు సేకరించి జిల్లా మెడికల్ ల్యాబ్‌కు పంపారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలంటే వారికి వండి పెట్టే వారు ఆరోగ్యంగా ఉండాలని, అందుకే రక్త పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. వ్యక్తిగత, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇందులో సీహెచ్‌ఓ శివరాజ్, సూపర్‌వైజర్ మణిమాల, హెచ్‌ఈ రాజేశ్వరి, హెచ్ఎం ఉన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తం

- వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరి
- పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి
- విద్యార్థులు, హాస్టల్ నిర్వాహకులకు సూచించిన వైద్యులు
- కస్తూర్బాగాంధీ, సంక్షేమ హాస్టళ్లలో వైద్యశిబిరం



మోమిన్‌పేట: కస్తూర్బాలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సుజల

మోమిన్‌పేట: సీజనల్ వ్యాధులతో ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని డాక్టర్ సుజల అన్నారు. గురువారం ఆమె మండల పరిధి చంద్రాయన్‌పల్లి కస్తూర్బాగాంధీ పాఠశాలలో విద్యార్థులకు, నాన్ టిచింగ్ సిబ్బందికి రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడారు. వానాకాలంలో సీజనల్ వ్యాధులు విజృంభించే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్ర పాటించాలని చెప్పారు. ఎప్పటికప్పుడు చేతులను సబ్బుతో కడుక్కోవాలని, వేడిగా ఉన్నప్పుడే భోజనం చేయాలని సూచించారు. మలేరియా, డయేరియా, టైఫాయిడ్ లాంటి వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, జ్వరం, కాళ్లు, చేతులు నొప్పులు, తల తిరుగుడు తదితర లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. తాగు నీటి ట్యాంకును శుభ్రం చేయాలని సిబ్బందికి చెప్పారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఉపాధ్యాయురాళ్లు ఉన్నారు.

టీహబ్‌కు రక్తనమూనాలు

కొడంగల్ రూరల్: సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అంగడిరాయిచూర్ పీహెచ్‌సీ డాక్టర్ విద్యాప్రియ అన్నారు. పట్టణ శివారులోని కస్తూర్బాగాంధీ విద్యాలయం, ఎంజేపీ వసతిగృహంలో విద్యార్థులకు, ఉపాధ్యాయ సిబ్బందికి వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. నాన్ టీచింగ్ సిబ్బంది రక్త నమూనాలను సేకరించి, టీహబ్‌కు పంపినట్లు ఆమె తెలిపారు. కలెక్టర్, డీఎంఅండ్‌హెచ్‌ఓ ఆదేశాల మేరకు సీజనల్ వ్యాధులు సోకకుండా వైద్య పరీక్షలు చేపడుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అమృత, ఎంఎల్‌హెచ్‌పీ అమృత, సూపర్‌వైజర్ సుశీల, ల్యాబ్ టెక్నీషియన్ మహేశ్, ఏఎన్ఎం చంద్రకళ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొడంగల్‌లో..

కొడంగల్: సీజనల్ వ్యాధుల కాలం గనుక.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్ అన్నారు. గురువారం పట్టణంలో గిరిజన బాలుర వసతి గృహాన్ని ఆయన సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడారు. వంటగదిని పరిశీలించారు. వంటకాల నాణ్యతను గమనించారు. అంటు వ్యాధులు సోకకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అనంతరం పట్టణంలోని వాటర్ ట్యాంకును మున్సిపల్ సిబ్బందితో శుభ్రం చేయించారు. పక్షం రోజులకు ఒకసారి ట్యాంకులను కడగాలని నీటి సరఫరా విభాగం సిబ్బందిని ఆదేశించారు.

ముందస్తు రక్త పరీక్షలు

ధారూరు: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, బాలుర బీసీ వసతిగృహంలో పీహెచ్‌సీ డాక్టర్ సుష్మ ఆధ్వర్యంలో రక్త పరీక్షలు నిర్వహించారు. సీజనల్ వ్యాధులు సంక్రమించకుండా విద్యార్థులు, నాన్ టీచింగ్ సిబ్బందికి ముందు జాగ్రత్తగా అన్ని రకాల రక్త పరీక్షలు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. ఇందులో డాక్టర్లు అజ్రాత జల్లి, ఐజర్ సిద్దికా, స్వాతి, ఎంపీహెచ్‌ఈఓ వెంకటేశ్వర్లు, హెల్త్ అసిస్టెంట్ సురేందర్, లాబ్ టెక్నిషియన్ అరుణ, ఎంపీహెచ్‌ఏ శోభారాణి, ఆశ వర్కర్లు తదితరులు ఉన్నారు.

వంటశాల పరిశీలన

బొంరాస్‌పేట: మండలంలోని ప్రభుత్వ వసతిగృహాలను మండల వైద్యాధికారి డాక్టర్ హేమంత్ కుమార్ తనిఖీ చేశారు. బొట్లోనితండా గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల, చెట్టుపల్లితండా కేజీబీవీలో వంటశాలల శుభ్రత, భోజనం నాణ్యతను తనిఖీ చేశారు. అనంతరం బోధన, బోధనేతన సిబ్బందితో మాట్లాడారు. వారందరినీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి, రక్త పరీక్షలు, ఆరోగ్య పరీక్షలు చేయించారు. ఇందులో సీహెచ్‌ఓ శివరాజ్, సూపర్ వైజర్ మణిమాల, హెచ్‌ఈ రాజేశ్వరి సిబ్బంది తదితరులు ఉన్నారు.



బొంరాస్‌పేట: వంటశాలను పరిశీలిస్తున్న మండల వైద్యాధికారి హేమంత్ కుమార్

అంటువ్యాధులతో..

తాండూరు రూరల్: అంటువ్యాధులతో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ డాక్టర్ రశీదు అన్నారు. మండల పరిధి జినుగుర్తి సమీపంలోని కేజీబీవీ, గిరిజన సంక్షేమ బాలికల, మైనార్టీ బాలుర వసతిగృహంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడారు. ప్రతి విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని సూచించారు. వేడి చేసి చల్లార్చిన నీటిని తాగాలని చెప్పారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని నిర్వాహకులను ఆదేశించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ల్యాబ్ టెక్నీషియన్, ఏఎన్ఎంలు, హాస్టల్ నిర్వాహకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



హాస్టల్ సిబ్బందికి వైద్యపరీక్షలు చేస్తున్న వైద్య బృందం

సంక్షిప్త వార్తలు

◆ హామీల అమలులో విఫలం

మర్పల్లి: హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని బీజేపీ కిసాన్ మోర్చా సభ్యులు ఆరోపించారు. ఇచ్చిన మాటను నిలుపుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ గణేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఇందులో పార్టీ మండల అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి మల్లేశ్. కిసాన్ మోర్చా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, నాయకులు లక్ష్మణ్, మధుకర్, శ్రీశైలం, యాదవరెడ్డి, శాంతకుమార్ ఉన్నారు.

◆ వ్యాధులతో జాగ్రత్త

మర్పల్లి: సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ డాక్టర్ నేహ అన్నారు. గురువారం పట్లూర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మండలంలోని ప్రభుత్వ హాస్టల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి అవగాహన కల్పించారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ జ్వరాలు సోకకుండా జాగ్రత్త పాటించాలని సూచించారు. అస్వస్థతకు గురైతే వైద్యులను సంప్రదించాలని చెప్పారు. తుల్జారాం గౌడ్, హెల్త్ సూపర్‌వైజర్ అమరేశ్వరి ఉన్నారు.

◆ అంకిత భావంతో పనిచేస్తే గుర్తింపు



బంట్వారం: జెడ్పీహెచ్ఎస్‌లో పని చేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులతో పాటు కొత్తగా నియమితులైన అధ్యాపకులకు ఎంఈఓ చంద్రప్ప గురువారం ఘనంగా సత్కరించారు. ఉద్యోగరీత్యా బదిలీలు, ఉద్యోగ విరమణలు సహజమేనన్నారు. అంకిత భావంతో పనిచేస్తే గుర్తింపు వస్తుందన్నారు. ఇందులో సీఆర్పీ నర్సింలు, సన్మాన గ్రహీతలు తదితరులు పాల్గొన్నారు.

◆ సమస్యలు లేకుండా చర్యలు

పరిగి: పట్టణంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్ అన్నారు. పట్టణ కేంద్రంలోని 14వ వార్డులో నీటి సమస్య ఉండటంతో గురువారం బోరు మోటారును బిగించారు. అనంతరం మాట్లాడుతూ.. ఎవరికి ఏమస్యలు ఉన్నా తమ దృష్టికి తెస్తే.. వాటిని పరిష్కరిస్తామని చెప్పారు. ఇందులో నాయకులు తాహేర్ తదితరులు ఉన్నారు.

◆ నోట్‌బుక్స్ పంపిణీ

మర్పల్లి: కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ పుట్టినరోజు సందర్భంగా గురువారం మండల పరిధి బూచన్‌పల్లి జెడ్పీహెచ్ఎస్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి మల్లేశ్ యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, వైస్ ప్రెసిడెంట్ రవీందర్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు అన్నపూర్ణ, ధామస్తాపూర్ మాజీ సర్పంచులు యాదవ్‌రెడ్డి, శాంతకుమార్, గోవర్దన్ రెడ్డి, శ్రీశైలంగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

◆ ఘనంగా జాంబవ జయంతి

ధారూరు: మాదిగ జాగృతి సంఘం ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో జాంబవ మహరాజ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహరాజ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, పూలమాలలు వేశారు. డీఎస్‌సీ మండల అధ్యక్షుడు శేఖర్ మహరాజ్, కోకన్వీనర్లు సత్యం, రాజులు, అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు టి.నర్సింలు, సంఘం నాయకులు కుమార్, ప్రవీణ్ ఉన్నారు.

◆ లోపించిన పారిశుద్ధ్యం

బంట్వారం: మండల కేంద్రం కోట్‌పల్లిలో పారిశుద్ధ్యం లోపించిందని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఉప్పరి మహేందర్ అన్నారు. గురువారం ఆయన గ్రామంలోని పలు కాలనీల్లో పర్యటించి, మురుగు కాలువలను పరిశీలించారు. పారిశుద్ధ్య లోపంతో గ్రామంలో ఈగలు, దోమలు, పందులు స్వైరవిహారం చేస్తున్నాయని, ప్రజలకు అంటు వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందన్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు.

◆ వసతిగృహ సిబ్బందికి వైద్య పరీక్షలు



యాలాల: మండల కేంద్రంలోని సంక్షేమ వసతి గృహ సిబ్బందికి గురువారం పీహెచ్‌సీ వైద్యాధికారులు వైద్య పరీక్షలు నిర్వహించారు. రక్త నమూనాలను సేకరించి, బీపీ ఇతరత్రా ఆరోగ్య సమస్యలపై ఆరా తీశారు. అనంతరం వంటశాల, పాత్రలను పరిశీలించారు. సీహెచ్‌ఓ చంద్రశేఖర్, ల్యాబ్ టెక్నీషియన్ భారతి, ఏఎన్ఎం శ్రీదేవి, భువనేశ్వరి, మంజుల ఉన్నారు.